

పెళ్ళినాడు అమ్మాయికి బుగ్గమీద దృష్టి తగలకుండా, మచ్చ పెడతారు.

* * *

నడిచి నడిచి అలిసిపోయాడు రాజ శేఖర్.

అంతగా నడిచి ఎన్నాళ్ళో అయింది మరి... అందుకేనేమో, ముప్పైఏళ్ళైనా లేకపోయినా, ఈ రెండు మైళ్ళ నడకకే అంత అలసట. కాళ్ళు నొప్పులు పెడుతున్నాయి. చెమట పోసేసింది. ఎగ ఊపిరి వొస్తోంది.

మైలురాళ్లు— అవే... కిలోమీటరు రాళ్ళు - చూసి ఉండకపోతే పది కిలో మీటర్లు నడిచానని శేఖర్ అనుకుని ఉండేవాడు. అలాగ ఉందతని పరిస్థితి.

ఎక్కడైనా కూర్చుని అరగంటసేపు విశ్రాంతి తీసుకుంటే గాని, ఏ నిమిషాన్నైనా కళ్లు తిరగవొచ్చు ననిపించింది రాజశేఖర్ కి.

చుట్టూ చూశాడు.

ఊటీ సౌందర్యమంతా తనకోసం ప్రదర్శిస్తోన్నట్టు ఉంది ప్రకృతి. బంగారపు రంగు ఎండలో పచ్చటి చెట్లు కొండల కెంతో అందం తెచ్చిపెడుతున్నాయి. కొండల శిఖరాలమీద తెల్లటి మబ్బులు ముంగురుల్లాగా తేలి తేలి ఆడుతున్నాయి.

అనుకోకుండా రోడ్డుపక్కన పెద్ద చెట్టూ, దానికింద తివాసీ వేసినట్టు గడ్డీ కనిపించేయి. కష్టంతోనే అయినా పిట్ట గోడ మీంచి దిగి, నాలుగు మెట్లలాంటి రాళ్ళను దిగి శేఖర్ అక్కడికి చేరుకున్నాడు—గడ్డి పట్టులాగ ఉంది. చెట్టుకి జేరబడి కళ్లు మూసుకున్నాడు శేఖర్— చుట్టూ అడవి పక్షుల శబ్దాలు. పట్టణ జీవితానికి అలవాటుపడ్డ అతని కా శబ్దాలు సంగీతంలాగ విన్పిస్తున్నాయి.

కళ్లు తెరవకుండా నిముషంపాటు శేఖర్ శబ్దాలన్నీ విన్నాడు. హఠాత్తుగా అతనికో ఆలోచన వొచ్చింది - అడవి జంతువు లేవైనా అనుకోకుండా ఇటు వొస్తే ? అడవి జంతువులదాకా వొద్దు— ఏ పామైనా అటు పాకివొస్తే ?

కళ్ళు విప్పి అతను మీదకి చూశాడు. చెట్టు చాలా మీదికి ఉంది. ఆ చిక్కటి కొమ్మల ఆకుల మధ్య ఏముందో ఎవరికి తెలుసును ?

అతను చెట్టునుంచి కాస్త జరిగి కూర్చున్నాడు.

మళ్ళీ కళ్ళు మూసుకుని ఇందాకటి ప్రశాంతిలాటిది మళ్ళీ పొందుదామని

చూశాడు- కాని, ఈ సారి అదిసాధ్యపడ లేదు... అలసట మళ్ళీ తెలిసివొస్తోంది.

అతను చుట్టూ చూశాడు.

తాను కూర్చున్న లోయ అవతల మరో కొండ. దాని చరియలో తెల్లటి కాటేజ్.

చుట్టూ చెట్లు.

మధ్య తెల్లగా కాటేజ్.

పిట్టగోడ అవతలి రోడ్డు రెండు వంపులు తిరిగి ఆ కాటేజ్ కిందనుంచి పోతోంది. కాటేజ్ అవతల ఎత్తులమీద టీ తోటల శిఖరాలు. పచ్చటి గడుల చీర ఆరవేసినట్టు... ప్రక్కగా దేవదారు తోట ... దాని పక్కన పోకచెట్లు కాబోలు ! సన్నగా పొడవుగా అంతు లేని ఆశ్చర్యార్థకాల్లాగ.

ఎంతో బాగుంది.

శేఖర్‌కి తన అద్దె ఇల్లు జ్ఞాపకం వొచ్చింది.

మూడుగదుల ఇల్లు- ఫేన్ ఉంచేనే గాలి, లైటు వేస్తేనే వెలుతురు. రెండు వేపుల రోడ్లమీద అహోరాత్రులు వాహనాల, మానవుల రొద. గాలిలో పొగ; పొగలో ధూళి; ధూళిలో విషం.

ఆరడుగుల చదరంగంలో ఆకుపచ్చ చెట్లు- జీవచ్ఛవల్లాగ... ప్రకృతి శాపం తిన్నట్టు.

ఏమిటో అలాగే అలవాటైపోయింది.

ఏడేళ్ళయి.

దౌర్భాగ్యుడు- మానవుడు... అన్నిటికీ సరిపెట్టుకుంటాడు.

తనలాగే ! తాను ఒకటి కాదు. చాలావాటికి సరిపెట్టుకున్నాడు.

అది ఇల్లు కాదు - నివాసం కాదు. తను తల దాచుకునే నిర్మాణం.

దానికే అలవాటుపడ్డాడు.

కొన్నాళ్ళు — మూడేళ్ళ కిందట కొన్నాళ్ళు... తాను రజనితోనూ సరిపెట్టుకున్నాడు.

ఆ ఇంట్లోనే !

కొత్త పెళ్ళికూతురుగా తనతో వొచ్చి, భయం భయంగా సిగ్గు సిగ్గుగా రజని తన ద్వారంలోకి వొస్తూంటే తాననుకున్నాడూ, తన జీవితంలోకి పరిపూర్ణత, సుఖం వొచ్చేయని.

అలా అనుకున్నాడు.

అలా కలలు కన్నాడు.

పది రోజులో, ఒక పక్షం రోజులో.. రజని- వెచ్చవెచ్చగా, తియ్యతియ్యగా ఆ కట్టడాన్ని గృహంచేసింది. గృహాన్ని స్వర్గసీమని చేసింది.

ఇలాగ ప్రశాంతంగా కూర్చుంటే, రజని జ్ఞాపకం వొస్తోంది.

అవన్నీ జ్ఞాపకం చేసుకోవాలనిలేదు.

అలసట తగ్గి, ఈ ప్రశాంతత రుచి తెలుస్తోంది, ఈ సుఖమయమైన క్షణాలలో ఆమెని జ్ఞాపకం చేసుకోవాలని లేదు.

బస్సులు రెండు కఠోరమైన రొద చేసుకుంటూ రోడ్డుమీద వెడుతున్నాయి.

గాలికి లేత మేఘాలలాగ శేఖర్ ఆలోచనలు చెదరిపోయాయి.

తిరిగి ఎలాగ వెళ్ళడం ?

నడవగలడా ?

బస్ ఏదైనా ఆగుతుందా ?

చూద్దాం, అనుకున్నాడు శేఖర్. కొంచెం ఓపిక వొస్తే ఎలాగైనా నడిచి వెళ్ళిపోవచ్చు.

టైమ్ చూసుకున్నాడు.

నాలుగు దాటింది.

రజని వొచ్చిన కొత్తలో ఫేక్టరీకి వెళ్ళినదగ్గరినించీ అతను టైమ్ చూసుకునేవాడు. విషయం తెలిసిన మిత్రులు కాస్త హాస్యంచేస్తూ ఉండేవారు.

మొదటి రోజుల్లో గుమ్మంలో అడుగు పెట్టేసరికి రజని టైమ్‌చూసి ముద్దుగా సంజాయిషీ అడిగేది.

ఎంత తియ్యగా ఉండేవి ఆ రోజులు! నిముషానికి విలువ ఉండేది; క్షణానికి అర్థం ఉండేది.

తియ్యటి రోజులు మరీ త్వరగా సాగిపోతాయి కాబోలు !

అందులోనూ, తనకి ఉన్నివి అవి మరీ తక్కువ !

అంత తక్కువ అని తనకి తెలీదు. వాటికి అంతం ఉంటుందనే ఆలోచనే లేదతనికి !

ఆ కొద్ది రోజులు — రెండు క్షణాల్లాంటి కొద్దిరోజుల తర్వాత రజనిలో మార్పు తాను కనిపెట్టలేదు. వెనక్కి తిరిగి ఆలోచిస్తే, చూచాయగా రాబోయే భీభత్సపు మొదటి, అస్పష్టమైన చిన్నెలు చూడగలిగాడు. కాని అప్పటికి జీవితం కాలిపోయింది.

మొట్టమొదట రజని తనకోసం ఎదురు చూడ్డం మానేసింది- గడియారం చూడ్డం మానేసింది సిగ్గువల్ల అని అన్వయించుకున్నాడు తాను.

ఆ తరవాత ఆమె పడకటింట్లో పుస్తకాలు చదవడం మొదలుపెట్టింది. వెలుతురులో నిద్రపోవడం నేర్చుకున్నాడు తాను.

అయినా, ఆమె ఒంటరిగా నిద్రించడం...

తాను కేంపుకి వెడతానంటే ఆమె కళ్ళలో కాంతి వొచ్చేది. దాని అర్థం తెలిసే నిఘంటువు లేక, క్రమంగా ఆమె సంసార జీవితానికి అలవాటు పడుతోందనుకున్నాడు రాజశేఖర్.

అలాగ క్రమక్రమంగా రజని తనకి దూరం అయింది- పేరుకి దాంపత్యం.. అంతే.

పెళ్ళి అయి అప్పటికి ఆర్నెల్లు పూర్తికాలేదు.

ఆ తరవాత ఒకనాడు రజని ఉద్యోగం చెయ్యడానికి తన అనుమతి కోరింది.

"నీ కెందుకు రజనీ, ఉద్యోగం ?" అన్నాడు తాను.

ఆమె జవాబు చెప్పలేదు.

"ఏం, ఇలాగ ఉంటే బాగాలేదా ?" అని అడిగాడు శేఖర్.

తన సంస్కారంలో గొప్ప లోపం ఏదో ఉందని అతననుకోలేదు-జరుగు తోన్నది అసామాన్యంగానూ అత నను కోలేదు. అందుకే అలాగ అడగ గలిగాడు.

రజని ఏమీ అనలేదు.

అట్టే మాట్లాడని వాళ్ళని చూస్తే శేఖర్‌కి కొంచెం భయం — మనసులో ఉన్నదేమిటో తెలిస్తే బాధలేదు గాని, తెలియకపోతే వెయ్యి విషయాలు సాధ్యం కావొచ్చు.

"పోనీలే - అలాగే చెయ్యి..." అన్నాడు.

ఈసారి రజని కొంత సంతోషంతో ధన్యవాదాలు చెప్తే, అదే ఒక ఉపకారం లాగ కనిపించింది శేఖర్‌కి.

"నేనూ నాలుగు చోట్ల కనుక్కుం టాను..." అన్నాడు కొంత తియ్యదనం ఉన్న ఆ చిన్న క్షణాల్ని పొడిగించ డానికి.

"వొద్దు - వొద్దు." అంది రజని ఆతృతగా.

"ఏం? ఏదైనా ఉద్యోగ్యం కుదిరేలాగ ఉందా ?" అన్నాడు రాజశేఖర్. పగలంతా ఒక్కతీ తనకోసం ఎదురు చూస్తూ కూర్చునే రజనికి అది సాధ్య పడుతుందని అతనికి తట్టలేదు.

"లేదు - అదే — అంటే, మిసెస్, శంకరం లేరూ ? ఆవిడ ఏదో ఎక్కడో ఖాళీ ఉందన్నారు. మీకేం శ్రమ అక్కర్లేదు," అంది అంత తొందర గనూ, రజని.

"మిసెస్. శంకరం... ఎవరూ ?"

"ఈ సారి పరిచయం చేస్తాను లెండి" అంది రజని.

ఏదో అనుమానం అతనికి, అవ్యక్తంగా.

"ఆమె ఎక్కడ కలిసింది ?" అన్నాడు తేలిగ్గా.

"ఈసారి పరిచయం చేస్తాగా !" అంది రజని, చికాకుపడుతూ. ఇందాకటి ఆనందంలేదు, ఆమెలో.

"ఊరికినే అడిగేనులే - మరెప్పుడు జాయిన్ అవుతా ?" అన్నాడు రాజ శేఖర్

"అప్లికేషన్ పెట్టాలిగా !"

"ఎక్కడ ?"

"మవుంట్ రోడ్‌లో. అదేదో ఏజన్సీ..."

"ఎవరిది ?"

"ఎవరో- కిశోర్ అని ఉన్నారుట. చెప్పేనుగా- మిసెస్ శంకర్‌కి బాగా తెలుసుట."

"గుడ్" అన్నాడు శేఖర్-ఇబ్బందిగా ఇంకేమీ అనడానికి లేక.

ఆ మరుసటి వారంలోనే రజని అక్కడ చేరింది.

ఇంట్లో వంటకి మనిషి.

ఆమె ఉదయం ఆలస్యంగా లేచి, పదకొండు దాటేక వెళ్ళేది. ఒక్కొక్క నాడు ఆరున్నరకో ఏడుకో వచ్చేది. కొన్నాళ్ళు ఇంకా ఆలస్యంగా, బాగా ఆలస్యంగా.

వొచ్చి, స్నానంచేసి, 'భోంచేశారా' అని అడిగేది.

"ఆఁ !" అనేవాడు తాను.

ఆ రోజు కదే సంభాషణ.

ఉండీ ఉండీ రజని ఒక్కొక్కనాడు అరుదుగానే- భార్యగానూ ప్రవర్తించేది.

ఆలోచన లేకుండానే తృప్తిపడే వాడు శేఖర్. ఆమెను ఎక్కువగాగాని అసలుగాని, ప్రశ్నించాలని అతని కుండేది కాదు. ఆమెకి వొచ్చే జీతం ఆమె బేంకులో వేసుకొనేది. అందులో తనకి భాగమిస్తానని అవమానపరచడం ఆమె చెయ్యనందుకు శేఖర్ సంతో షించేడు.

అలాగ సంవత్సరం గడిచాక ఒక సారి కేంపుకి వెళ్ళివచ్చాడు శేఖర్. అనుకోకుండా ఆ రాత్రి ఢిల్లీనించి తిరిగి వొచ్చి పదకొండవుతోంటే ఇల్లు చేరే సరికి లోపలినించి గొంతుకలు...

" యువార్ నాటీ... కిశోర్ ! " అంటోంది రజని.

ఆనాలోచితంగా తలుపు కొట్టాడు శేఖర్.

"ఎవరు ?" అని లోపలినించి ప్రశ్న.

"నేనే" అన్నాడు, తిరిగి వెడుతోన్న టాక్సీవేపు చూస్తూ.

మూడు నాలుగు నిమిషాల తరవాత రజని తలుపు తెరిచి నవ్వుతూ, "ప్లేన్ లేటా ?" అంది.

"అవును," అన్నాడు తను లోపలికి అడుగు పెడుతూ.

"మీట్ మిస్టర్ కిశోర్... మై బాస్"

కరచాలనం.

"ఆఫీస్‌లో ఆలస్యంగా ఉన్నానని డ్రాప్ చెయ్యడానికి వొచ్చారు..." అంది రజని.

"గుడ్" అన్నాడు. రజని నవ్వు తోంది. ఆమె బుగ్గమీద ఎర్రటి మచ్చ- గుండ్రంగా లేదుగాని...

"మళ్ళీకలుద్దాం. ప్లెజర్ మీటింగ్... గుడ్‌నైట్" అంటోనే వెళ్ళేడు కిశోర్. కొంత సేపయాక రజని ఇటు చూసింది.

శేఖర్‌కి కోపంగా ఉంది

రజనిమీద కాదు- విచిత్రంగా.

తనమీద.

ఆ పరిస్థితిలో అలాగ ప్రవర్తించి నందుకు.

"మీరు... పొరపాటుగా ఆలోచిస్తు న్నారు" అంది రజని. ఆమె గొంతుకలో ఏదో వొణుకు.

" అవును రజనీ... పొరపాటు నాదే-" అన్నాడు రాజశేఖర్. నిజంగా పొరపాటుపడ్డాడా ?

ఆమె స్నానం చేస్తానని వెళ్ళిపోయింది. మర్నాడు అతడు బయలుదేరేసరికి ఆమె నిద్ర లేవలేదు.

ఆ సాయంత్రం ఆమె ఆరింటికే తిరిగొచ్చింది.

ఆ తరవాత సంసారం సామాన్యంగానే సాగిపోతోంది. ఆమె వెళ్ళిపోతానన లేదు... అంటే, ఆమెని ఆపలేనని తెలుసును గనక తానేమీ అనలేదు. తాను వెళ్లమని అనడు- అంటే ఆమె వెళ్ళిపోతుందని తెలుసును గనక.

అలాగ సాగుతోంది తన సంసారం. ఈ ప్రశాంతతలో ఎంత వొద్దన్నా జ్ఞాపకం వొస్తోంది. ఆ సాయంత్రం- ఢిల్లీనించి అనుకోకుండా తిరిగొచ్చిన సాయంత్రం అన్నిటికన్నా తనకి బాగా జ్ఞాపకం ఉండిపోయినది రజని బుగ్గమీద మచ్చ...

ఒక్కసారి ఎండపోయి చల్లబడిపోయింది - శేఖర్ మీదికి చూశాడు. మేఘాలు త్వరత్వరగా ముసురుకుంటున్నాయి. నిమిషాలలో వర్షం వొచ్చేలాగ ఉంది.

అతను లేచి నిలబడి, వొళ్ళు దులుపుకుని తెల్ల కాటేజ్‌వైపు చూశాడు. ఈసారి నీడల్లో రంగులన్నీ వేరుగా కనిపిస్తున్నాయి.

త్వరగా అడుగులు వేసి రోడ్డుమీదకి వొచ్చాడు. లోయల్లో చెట్లన్నీ పొగలాంటి మేఘాల తెరల్లో విచిత్రంగా ఉన్నాయి.

బస్ ఏదో వొస్తోంది. అతను చెయ్యెత్తినా ఆగకుండా వెళ్ళిపోయింది.

వొర్షం వొస్తే తడుస్తానని భయం.

కాళ్లు నొప్పిగా ఉన్నాయి.

పిట్టగోడకి ఆనుకుని నిలబడ్డాడు. చినుకులు రానే వొచ్చాయి.

రెండు నిమిషాలు నడిచి, రోడ్డుకి అటు ఉన్న చెట్టుకింద నిలబడ్డాడు. అయినా, బాగా తడసిపోయాడు.

చలి.

భయం.

బాధ.

అవమానం.

జేబులో అయిదారు వొందల రూపాయలు ఉన్నాయి- ఏమిటి లాభం? ఇంట్లో రజని ఉన్నట్టే!

ఎవరైనా తనని హోటల్‌కి చేరిస్తే, ఎంతయినా ఇచ్చి ధన్యవాదాలు చెప్పేందుకు సిద్ధంగా ఉన్నాడు శేఖర్.

వర్షం బాగా పడిపోతోంది.

చీకటి...

ఇక నడవక తప్పదని రోడ్‌మీదకి వొచ్చేసరికి అటునించి వొస్తూన్న కారు దీపాలు అతనిమీద పడ్డాయి. మరో కొంచెం క్షణాలలో కారు ఆగింది.

"కమిన్" అందొక చక్కటి గొంతుక.

కలా, నిజమా అని ఆలోచిస్తూన్న అతని చెవిలో "కమాన్" అన్న మరో గొంతుక... మగవాడిది, వినిపించింది.

డ్రైవరు వొంగి ఫ్రంటు డోర్ తెరిచాడు. శేఖర్ ఎక్కి కూర్చున్నాడు. "థాంక్స్...థాంక్స్..."అన్నాడుకారు కదిలింది.

"నేను... కూనూర్ వెళ్ళాలి" అన్నాడు.

ఎవరూ జవాబివ్వలేదు,

కారు సాగిపోతోంది. లోపల వెచ్చగా ఉంది. శేఖర్ తన బట్టలవల్ల కారు సీటు పాడౌతుందేమోనని భయంగా కూర్చున్నాడు. ఏం జరుగుతోందో అతనికి బోధపడలేదు.

పది నిమిషాల్లో కారు ఆగింది. ఒక చక్కటి కాటేజ్ ముందర. సాయంత్రం చూసిన దానిలాగే ఉంది.

వెనక సీటులో ఉన్న యువతి దిగి వెలుతురులో నిలబడేసరికి శేఖర్‌కి ఆమె దేవతలాగ కనిపించింది. అంత అందంగా ఉంది.

అతనూ దిగాడు.

"డ్రైవర్ !..."

అమె పిలుపు విని, డ్రైవరు వెళ్ళి వినయంగా నిలబడ్డాడు. ఏదో భాషలో ఆమె అతని కేమిటో చెప్తోంది. డ్రైవర్ బుర్ర ఊపాడు. శేఖర్‌కి భయంగా ఉంది.

ఆమె వెడుతూ శేఖర్‌వైపు చూసింది. అతనికి మూర్ఛ వొచ్చినంత పని అయింది.

ఆ ముఖం అతనికి తెలుసును !

ఆ బుగ్గన ముద్దొచ్చే నల్లటి మచ్చ. కాటుకబొట్టులాగ ......పెళ్ళికూతురుకి పెట్టే కాటుక బొట్టులాగ.

ఆమె మెట్లెక్కి మేడమీదకి వెళ్ళిపోయింది.

డ్రైవరు ఎవరినో పిలిచి శేఖర్‌ని అప్పగించి ఏదో చెప్పేడు. అతను పిలిస్తే, అతని వెంటే ఒక గదిలోకి వెళ్లేడు శేఖర్.

రెండు తువ్వాళ్ళిచ్చి, కట్టుకున్న తడి బట్టలు తీసిమ్మని చెప్పేడు అతను.

శేఖర్ త్వరత్వరగా తడిసిన బట్టలనించి బయటపడ్డాడు— ఒళ్లంతా తుడుచుకుని, అతనిచ్చిన లుంగీ, కట్టుకుని, బుషషర్ట్ తొడుక్కుని, కుర్చీలో కూర్చున్నాడు.

కళ్యాణి... కళ్యాణి

అవును.

ఆమె కళ్యాణి. ఇక్కడి కెలా వచ్చింది ?

అప్పటికన్నా, ఇంకా ఎంతో అందంగా ఉంది.

బయట వర్షం జోరుగా పడుతూనే ఉంది.

మీదనుంచి ఏదో సంగీతం వినిపిస్తోంది.

కళ్యాణి వింటోంది కాబోలు !

"టీయా, కాఫీయా సార్ ?"

"కాఫీ..."

**అతను వెళ్ళిపోయాడు.**

వీళ్ళంతా కళ్యాణి నౌకర్లు.

ఒకనాడు తనని పెళ్ళిచేసుకొమ్మని ప్రాధేయపడ్డ కళ్యాణి,

ఇవేళ తనకి ఆశ్రయం ఇచ్చింది !

ఆ బుగ్గమీద నల్లటి మచ్చ.

అదే జ్ఞాపకం చేసింది.

కళ్యాణితో ఒకప్పుడు తన పెళ్ళి నిశ్చయం అయిపోయింది. పిల్లని చూడగానే తనకి నోట మాటరాలేదు. అప్పటికీ అలాగ ఉండేది.

ఆమెకి తల్లి తప్ప ఇంకెవరూ లేరు.

తల్లికి కేన్సర్. మూడు మాసాల టైమిచ్చేడు డాక్టరు.

ఎలా వొచ్చిందో. అమ్మకి ఈ సంబంధం మాట తెలిసింది. పిల్లని చూడ్డం, సరేననడం అంతా జరిగి పోయింది.

ముహూర్తమే తరవాయి.

ఆ మూడోరోజున అతనికో ఉత్తరం వొచ్చింది.

అది కళ్యాణిని గురించి.

ఆమె వెనకాల చాలా చరిత్ర ఉందనీ శేఖర్‌లాంటి పెద్దమనిషికి భార్య కావలసనది ఆమె కాదనీ, కాదని చేసుకుంటే అతను జీవితాంతమూ విచారించాల్సి వొస్తుందనీ అందులో సారాంశం.

ఉత్తరంతో ఒక ఫొటో.


అసహ్యమైన వివరాలు, అందులో.

ఆమె ముఖం అంతా కనిపించదం లేదా ఫోటోలో- ఆ భంగిమ అలాంటివి. కాని, ఆ బుగ్గమీద చిన్న, ముద్దొచ్చే మచ్చ– పొరపాటు లేకుండా ఆమె ఎవరో తెలిసేలాగ చేస్తోంది.

శేఖర్‌కి మతిపోయింది.

ఇది నిజమా ? అనుకున్నాడు ముందు.

నిజం, నిజం ! అంటోంది మచ్చ.



అగాధంలో మునగబోయేవాణ్ణి ఆపిన ఈ పుణ్యాత్ముడెవరనే ధ్యాస అంతగా రాలేదతనికి ప్రపంచంలో మంచివాళ్ళు కూడా ఉంటారని అతనికి నమ్మకం.

అమ్మతో సగం చెప్పేడు.

"ఛీ ! ఆ పిల్ల అలాంటిది కాదు.." అంది అమ్మ.

"నీకెలాగ తెలుసు?" అన్నాడతను.

"నా క్కాకపోతే నీకా తెలుసు ?" అంది అమ్మ.

ఆ అసహ్యమైన ఫోటో ఆమెకి చూపాలని లేదు... కాని, ఆమె ఇంక ఆ విషయంలో నిర్ణయం అంతా అతనికే వొదిలి, 'నీ ఇష్టం' అన్నాడన్న అవసరం లేకపోయింది.

మరుసటి రోజున వాళ్ల ఇంటికి వెళ్లేడు.

కళ్యాణి ఇవతలి గదిలో కూర్చుని చదువుకుంటూంది.

అతన్ని చూడగానే లేచి లోపలికి ఆహ్వానించింది.

లోపలికి రాకుండా, "ఒక్కసారి, ఇవతలికి రాగలవా ? నీతో కొంచెం మాట్లాడాలి," అన్నాడు ఆమెవంక చూడకుండా. చూస్తే మనసు నిలవదని భయం.

"ఎందుకు ?" అంది భయంగా, కళ్యాణి.

"చెప్తాను ... పది నిమిషాలు" అన్నాడు శేఖర్.

"అమ్మ మత్తు నిద్రలో ఉంది- పిలిస్తేనో !" అంది. తనకి తానేలాగ, కళ్యాణి. ఎంత అమాయికంగానో అన గలిగింది, అనుకున్నాడు శేఖర్.

"నీ ఇష్టం-అలాగ గేటుదాకా రా. చాలు." అన్నాడు శేఖర్.

ఆమె గేటు దగ్గరికి వొచ్చింది.

అవతల వీధి దీపం.

నిమిషం అతనేమీ మాటలాడలేక పోయాడు - ఆమె మీది ఆగ్రహం, అసహ్యం, అంత దగ్గిరగా ఆమె రాగానే, దూరంగా వెళ్ళిపోయాయి.

"ఏమిటండీ ?" అంది, చివరికి.

"ఈ ఫోటో చూడు." అన్నాడు ఉపోద్ఘాతమంతా మరిచిపోయి.

మసక చీకటిలో,వీధిదీపపు వెలుగులో ఆమె ఫోటో చూసి తలమీద ఒక చెయ్యీ, గేటుమీద ఒక చెయ్యీ వేసుకుంది. ఫొటో నేలమీద పడింది. అతను తీసుకుని, కవర్లో పెట్టి జేబులో పెట్టుకున్నాడు.

"కళ్యాణీ ! కళ్యాణీ !" అన్నాడు శేఖర్. ఆమెకి మూర్ఛ వొస్తే ఏం చెయ్యాలని భయం. ఆమె నుదుటిమీద చెమట-

ఆమె నెమ్మదిగా శక్తి సంత రించుకుని గేటు నానుకుని నిలబడింది.

"ఇందుకేనా పిలిచారు ?" అంది నీరసంగా.

శేఖర్ జవాబివ్వలేదు.

"ఎక్కడిదా ఫొటో ?"

"పోస్టులో వొచ్చింది..."

"మీరు-పొరపాటు పడుతున్నారు" అంది కళ్యాణి. చీరకొంగుతో నుమరు తుడుచుకుంటూ... లేక వోణీ వేసు కుందా ? ఏమో ! జ్ఞాపకం లేదు.

"పొరపాటు కాదు..."

"ఎలాగ తెలుసు ?... ఇందులో మోసం ఉంది !

"నాకు కళ్ళూ బుర్రా ఉన్నాయి..."

ఆమె కళ్ళు తడుచుకుంది.

"ఈ మాట నీతో చెప్దామనే వొచ్చాను- మన పెళ్ళి జరగదని వేరే చెప్పక్కర్లే దనుకుంటాను .."

అతనికి వెళ్ళాలని లేదు. మాటల్తో ఆమెని గాయపరచాలనీ, దైహికంగా ఆమె నేమో చెయ్యాలనీ అంతరాంత రాలలో కసి- కాని, పిరికితనం. అక్కడ ఉండలేడు. వొదిలి వెళ్లలేడు.

"ప్లీజ్ ! ఈ మోసం ఎవరు చేస్తున్నారో తెలీదు. మా అమ్మ నా పెళ్ళి కోసమే బ్రతికిఉంది... దయచేసి మీరు...మీరు..." కళ్యాణి గొంతుక పూడ్చుకుపోయింది.

" నిన్ను పెళ్ళి చేసుకోవాలి ? అదేనా ?" అన్నాడు శేఖర్.

"అవునండీ ! అమ్మకి ఈ చివరి ఆనందం హాలాహలం కానివ్వకండి... ప్లీజ్ !"

"సారీ కళ్యాణీ ! తెలిసిఉండీ... ఈ పెళ్ళి చేసుకునేంత మూర్ఖుణ్ణి కాను నేను !" అన్నాడు.

ఆమె ఇంకా ఎంతో ప్రాధేయపడింది. అతనా నిమిషాలలో పది అడుగుల ఎత్తైన మనిషిలాగా అనుభూతి చెందాడు.

వెనక్కి చూడకుండా వెళ్ళిపోయాడు.

ఆ నాటికి ఈనాడు.

ఆ కళ్యాణి, ఈ కళ్యాణి.

శేఖర్ గదిచుట్టూ చూశాడు. ఇది బెడ్ రూము. అన్నీ ఖరీదైన వస్తువులు.

చిన్న టేబుల్ మీద రాధాకృష్ణుల దంతపు చెక్కడం.

సర్వెంటు కాఫీ తెచ్చేడు.

వాటితోబాటు వేడివేడి పకోడీలు.

ఒక్కసారి ఆకలివేసింది శేఖర్‌కి.

బయట వర్షం ఇంకా ఎక్కువై పోయింది.

ఆకలిగా, ట్రే అంతా ఖాళీచేసి, రెండు కప్పుల కాఫీ తాగాడు శేఖర్.

కాఫీ బాగుంది.

లోపల హీటర్లు రెండు ఎర్రగా ప్రకాశిస్తున్నాయి. చక్కగా, వెచ్చగా ఉంది.

గది తలుపు తీసి సర్వెంటు వొచ్చి ట్రే తీసుకెళ్లాడు.

వెనువెంటనే కళ్యాణి లోపలికి వొచ్చింది.

"కాఫీ తాగేరా ?" అంది.

అతను లేచి నిలబడి, "థాంక్స్ ! చాలా క్లిష్టసమయంలో వొచ్చి రక్షిం చారు !" అన్నాడు.

ఆమె ఒక హీటరు పక్క కుర్చీలో కూర్చుని, అతన్ని కూర్చోమని సంజ్ఞ చేసింది.

అతను కూర్చున్నాడు.

"మిమ్మల్ని... ఇలాటి పరిస్థితిలో మళ్ళీ కలుసుకుంటా ననుకోలేదు..." అన్నాడు కష్టంగా.

కళ్యాణి వెండిమువ్వల రవళిలాగ నవ్వుతూ, "ఏం ?..." అంది.

అతను ఇబ్బందిపడ్డాడు.

"మీ అమ్మగారు..." అన్నాడు.

"ఆ వెంటనే పోయింది," అంది కళ్యాణి.

"సారీ !"

"మరేమీ బాధపడకండి. అదృష్టం కొద్దీ ఆ రాత్రి మగతనించి ఆమె తేరు కోలేదు," అంది కళ్యాణి.

"పాపం !" అన్నాడు శేఖర్, ఇంకేమనాలో తోచక.

ఆమెతో ఏమనాలి ?

"మీరు సుఖంగా ఉన్నందుకు చాలా సంతోషం" అన్నాడు. ఏదో ఒకటి అనాలని.

ఆమె చిరునవ్వుతో తల ఊపి "ఇవాళ నిజంగా సుఖంగా ఉంది నాకు..." అంది.

అతనికి సరిగా అర్థంకాలేదు.

"మీ ఆయన..."

"రేపు వొస్తారు. వ్యాపారంమీద స్టేట్స్ వెళ్లేరు- వారం కిందట."

"అలాగా !" అన్నాడు శేఖర్.

మళ్ళీ నిశ్శబ్దం.

"మీరు... ఇక్కడేనా ఉండడం?" అంది కళ్యాణి.

"కాదు కాదు - మద్రాసులో" అన్నాడు శేఖర్.

"అప్పటి ఉద్యోగమేనా ?"

"అవును — నాలుగు ఇంక్రిమెంట్లు ఇచ్చేరు..."

"పిల్లలా ?"

"లేరు..."

ఆమెకో ? అడగాలనిపించలేదు. పెళ్ళికూతురిలాగ ఉన్నది కళ్యాణి.

"మీ బట్టలు డ్రయర్‌లో ఆరేశాడు.. మరో పదినిముషాల్లో వొస్తాయి."

"థాంక్స్ ! మీకు చాలా శ్రమ ఇచ్చేను."

మళ్ళీ నవ్వింది కళ్యాణి.

"శ్రమ ఏమీలేదు లెండి- సర్వెంట్లు చేసేదే కదా !" అంది.

"అతను తన బట్టలవైపు చూసుకున్నాడు.

ఆమెవైపు చూశాడు.

బుగ్గమీద నల్లటి ముద్దొచ్చే మచ్చ.

తెల్లటి మెడ.

మెడలో ఒకటే ఒక సన్నటి బంగారు గొలుసు

ఆ నాటిని గురించి మాట్లాడాలని ఉందతనికి— క్షమాపణ చెప్పాలని ఉంది.

"ఆ రోజు-" అని, ఆగిపోయాడు.

"ఊఁ ?" అంది, నవ్వకుండా కళ్యాణి.

"జరిగినదానికి క్షమించాలి."

ఈసారి తేలిగ్గా నవ్వింది కళ్యాణి.

"ఏం మీది పొరపాటనా ?"

"అవును."

"ఎలా తెలిసింది ?"

అతనేమీ అనలేదు.

"ఇలా ఉన్నాననా ?"

అతను నేలమీది తివాసీని పరీక్షిస్తున్నాడు.

"ఆ ఫొటో... ఏంచేశారు?" అంది కళ్యాణి.

"చించి పారేశాను..."

ఉత్సుకతతో "ఎప్పుడు ?" అంది కళ్యాణి.

"ఆ మర్నాడు..."

"నిజంగా ?"

"అవును."

ఇంక చెప్పుకోవాల్సిన వేమీ లేనట్టు, మళ్ళీ నిశ్శబ్దం ఆవరించింది.

"భోజనం చేస్తారా ?"

"ఆకలి లేదు..." అన్నాడు శేఖర్.

"ఆగి, చెయ్యొచ్చును..."

"వొద్దులెండి— బట్టలు రాగానే వెడతాను—"

"వర్షం తెగపడుతోంది !"

ఇబ్బందిగా, "అపను." అన్నాడు శేఖర్.

"కారు ఇస్తానులెండి" అంది కళ్యాణి నవ్వుతూ.

"థాంక్స్..."

"కావాలంటే రాత్రి ఇక్కడ ఉండి, ఉదయం వెళ్ళొచ్చు."

"వొద్దులెండి !"

"ఏం ! శ్రీమతి కోపగిస్తుందా ?"

"ఆమె ఇక్కడ లేదు - మద్రాసులో ఉంది."

"మరి ?"

"చిన్న పనిమీద వొచ్చాను..."

"వెళ్ళిపోతారా ?"

"రేపో, ఎల్లుండో !

"ఎక్కడ మకాం ?"

"హోటల్లో..."

"బాగుందా ?"

"లేదు."

"పోనీ- ఈ రాత్రి ఇక్కడే ఉండండి."

చిత్రంగా నవ్వుతోంది కళ్యాణి, మెడలోని సన్నటి గొలుసుతో ఆడుకుంటూ. నల్లటి మచ్చ ఎంతో ముద్దొస్తోంది

"వొద్దులెండి— ఇప్పటికే మీకు చాలా శ్రమ ఇచ్చేను..."

---

ఆమెకి రజనిని గురించి చెప్పుకోవాలని ఉంది. ఆ రాత్రి అంతా ఆమె మాట్లాడుతోంటే వింటూ ఆమెని చూస్తూ కూర్చోవాలని ఉంది.

కాని, జీవితంలో కోరినవన్నీ జరగవు.

తనది శ్మశాన జీవితం.

ఈమె కళ్యాణి. నిత్య కళ్యాణి.

ఆమె టేబిల్‌మీద చిన్న గంట కొట్టింది. సర్వెంటు అతని బట్టలు చక్కగా మడిచి తెచ్చేడు.

ఆమె బయటికి నడిచింది.

అతను బట్టలు వేసుకుని బయటికి వొచ్చేసరికి కారు సిద్ధంగా ఉంది.

"వెడతానండీ ! చాలా థాంక్స్!" అన్నాడు శేఖర్.

ఆమె నవ్వకుండా చెయ్యి ఒక్కసారి ఊపింది. కారు వర్షంలోకి వెళ్ళిపోయింది.

ముడుచుకుని కూర్చుని, తన అదృష్టానికి తననే అభినందించుకున్నాడు శేఖర్. బట్టలు వెచ్చగా ఉన్నాయి.

అతను వెళ్లేక కళ్యాణి కొంత సేపు వరండాలోనే నిలబడి ఉండిపోయింది.

మరొకసారి అతన్ని ఉండమని అనాల్సిందేమో! అనుకుంది.

ప్రయోజనం లేదులే అని సమాధానపడింది.

నెమ్మదిగా మెట్లెక్కి తన గది చేరింది.

బయట వర్షం క్రమక్రమంగా తగ్గుతోంది.

అద్దంలో తన బుగ్గలనీ, మెడనీ చూసుకుని నిట్టూర్చి, పుస్తకం తీసుకుని కుర్చీలో కూర్చుని చదువుకోసాగింది కళ్యాణి.

* * *

పెళ్ళినాడు అమ్మాయికి బుగ్గమీద మచ్చ పెడతారు, దృష్టి తగలకుండా.

కొందరికి ఎప్పుడూ దిష్టి తగలదు.

వాళ్ళ మచ్చ అలాంటిది.